## పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

పర్సనల్ సెక్రటరీ పోస్టుకి ఇంటర్వ్యూ జరుగుతోంది.

"మూడు మూడు ఎంత ?" అడిగాడు అందుకోసం ప్రత్యేకంగా పిలిపించబడిన సైకాలజిస్ట్ మొదటి అమ్మాయిని.

"ఆరు" అందా అమ్మాయి.

రెండో అమ్మాయిని అడిగాడు. ఆ అమ్మాయి కాసేపు ఆలోచించి "అయితే ముప్పైమూడు" అంది.

మూడో అమ్మాయిని అడిగాడు.

"సున్నా" అంది.

ఇంటర్వ్యూ చేసే సైకాలజిస్ట్ అక్కడే కూర్చున్న బాస్‌కి వాళ్ళగురించి వివరించాడు.

"మొదటి అమ్మాయి ఖచ్చితమైన సమాధానమిచ్చింది. రెండో అమ్మాయి మనమేదో లాజిక్ ప్లే చేసామనుకొని రెండు జవాబులు ఇచ్చింది. ఇక మూడో అమ్మాయి తనిష్టం వచ్చినట్లు చెప్పింది. ఆ పోస్ట్‌కి సూట్ అయేది..." అని చెప్పబోతుండగా...

"మూడో అమ్మాయే" టాపీగా అన్నాడు బాస్.

"ఎందుకు ?"

"తెల్లగా, బాగా పుష్టిగా, సెక్సీగా, ఆ రక్తంలో పుత్తు ఉంది చూడు. ఆ అమ్మాయినే సెలెక్ట్ చెయ్యాలి. నా పర్సనల్ సెక్రటరీ పోస్ట్‌కి బాగా సరిపోయింది" అన్నాడు.

– యం. కె.వి. సీతారామ్
(విశాఖ)

*స్రవంతి నెం: 15 లో ఈ శీర్షికలో ప్రచురించిన కథకి రచయిత శ్రీ ఎం. అంజిరెడ్డి పెట్టిన పేరు : అసలు విషయం*

***ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ : శ్రీ కె. కె. మీనన్.***



"నేను చదివిన కథల్లో రచయితలకి అనుభవం లేకపోవటంతో కథాప్రక్రియకి దూరంగా రచనలు సాగినట్లు తోచింది. శైలి, బిగి, కథనం ఉన్న 'అనుకోని అతిథి' 'సంగమం' రెండు కథల్ని ఎన్నిక చేశాను. వర్ధమాన రచయితలందరికీ నా శుభాకాంక్షలు."

అంటూ ప్రారంభించిన శ్రీ కె. కె. మీనన్ నూటయాభై కథల్ని ఓ అరడజను నవలల్ని అన్ని పత్రికల్లోనూ రాయటమే కాక–తన వ్యాసాలతో, రేడియో కథలతో అటు పాఠకులకి ఇటు శ్రోతలకి సుపరిచితులు.

"రాసింది కొద్దికాలమైనా నిలవాలనే పేరాశే తనలోని రాయాలనే తపనని మింగేస్తోందని" చెబుతూ "రావిశాస్త్రి శైలితో కాళీపట్నం రామారావుగారిలా కథ రాయాలనే" తన తీరని తీయని కోర్కెను వెలిబుచ్చారు.

# అనుకోని అతిథి

సిగరెట్ అయిపోయి వేలు చురుక్కుమనేసరికి, యాష్‌ట్రేలో నొక్కేశాడు సాగర్ దాన్ని. కానీ అంతరంగంలో ఉవ్వెత్తున లేస్తున్న ఆలోచనల్ని [illegible] ఆలోచనల తుఫానుకి కారణం [illegible] మూడు [illegible] క్రితం విడాకులు తీసుకుందామని [illegible] తీసుకున్న నిర్ణయం.

వాసంతి పెళ్ళికాక మునుపు రాఘవను ప్రేమించింది. కానీ ఒక దుష్ట క్షణంలో రాఘవ మీద ఒక హత్యకేసు పడింది. ఊరు విడిచి పారిపోయాడు రాఘవ. కొన్నాళ్ళ తర్వాత అసలు హంతకుడు దొరికి రాఘవ నిర్దోషి అని తెలిసినా, రాఘవ జాడ తెలియలేదు. గత్యంతరం లేక సాగర్‌ని పెళ్ళాడవల్సివచ్చింది వాసంతికి. సాగర్‌కి పెళ్ళికిముందే చెప్పింది వాసంతి అసఫలప్రణయం గురించి. అయినా ఆమె అందం, సంస్కారం, ఆమె గతాన్ని కప్పేశాయి.

రాఘవ సాగర్ మిత్రుడిగా మళ్ళీ ప్రవేశించాడు. మొదట్లో చాలా వేదన అనుభవించాల్సి వచ్చింది వాసంతికి. రాఘవను చూస్తూ, అతనితో ఒక అపరిచితురాలిలాగా, స్నేహితుడి భార్య హోదాలో మాట్లాడుతూ, సాగర్‌తో కాపురం చెయ్యటానికి. చివరికి ఒకరోజు సాగర్‌కి చెప్పేసింది రాఘవే తన పాత ప్రేమికుడని. సాగర్ భయపడనూలేదు, బాధపడనూ లేదు రాఘవను ఇంటికి రావద్దని అననూలేదు. వాసంతే చివరికి భర్త ప్రవర్తన అర్థంకాక నిలదీస్తే అన్నాడు. "అతను నాకు స్నేహితుడు, నీకూ స్నేహితుడనే అనుకో. అంతకు మించి నువ్వు ఏమీ ఆలోచించకు. నేనూ ఆలోచించను" అని.

కానీ ఆ కథ అక్కడ ఆగలేదు.

"నేను రెడీ ! లాయర్ దగ్గరికెళదామా ?" వాసంతి పిలుపుకి ఈ లోకంలోకి వచ్చాడు సాగర్. బయల్దేరారు.

లాయర్ తీరికగానే ఉన్నాడు. అతనికి అంతకుముందు రోజే అన్నీ వివరించటం జరిగింది. పిటిషన్ తయారుగా ఉంచాడు. వాసంతి ముందర పేపర్స్ పెడుతూ అన్నాడు "మళ్ళీ ఆలోచించుకో అమ్మా!"

"నో సర్! నా మనసు ఇప్పటికే ఛిద్రమైపోయింది. ఇంక ఈ సమస్య గురించి ఆలోచించలేను. కాపురంలో మొట్టమొదట నిజాయితీ కావల్సి వస్తుంది. వెన్ దట్ లాక్స్...." వాసంతి అంది.

"నాకర్థంకాలేదు" లాయర్ అన్నాడు.

"వైవాహిక ధర్మం ప్రకారం నేను పరపురుషుణ్ణి కన్నెత్తి చూడకూడదు. కానీ రాఘవ మళ్ళీ కనిపించినప్పటినుంచీ నాలోని స్త్రీ అతనివైపు ఆకర్షితురాలవుతోంది. ఆయనకు ఈ విషయం అప్పుడే సూచనప్రాయంగా చెప్పాను. కానీ ఆయన వినలేదు. రాఘవ మా యింటికి రావటం అనే అధ్యాయాన్ని అప్పుడే ముగించి ఉంటే.... పెర్‌హాప్స్ పరిస్థితులు ఇంకోలా ఉండేవేమో! కానీ ఇప్పుడు ఒక్క మాటలో

స్రవంతి నెం: 13లో ఇచ్చిన "విడాకులిచ్చినా మేం ఒకే ఇంట్లో ఉంటామండి" అన్నాడు సాగర్ లాయర్‌తో. వాక్యం ఆధారంగా రాసిన కథలు

చెప్తాను. నేను భార్యగా ఓడిపోయాను, నా లోని స్త్రీ చేతుల్లో:" అంటూ సంతకాలు చేసిన పేపర్లు లాయర్ చేతికి అందించింది.

అర్థమైనట్టుగా తల ఊపాడు లాయర్. అన్నాడు "రేపు ఫైల్ చేస్తున్నాను మీ పిటిషన్ మీ అయిన సమన్లు తీసుకొని కోర్టుకి రాకపోతే ఎక్స్‌పార్టె అవుతుంది. దట్సాల్."

కాసేపు ఆ గదిని మౌనం పరిపాలించింది. తర్వాత లాయర్ అన్నాడు. "మీరు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారా? వేరే ఇల్లు వగైరా!"

"విడాకులిచ్చినా మేం ఒకే ఇంట్లో ఉంటామండీ!" అన్నాడు సాగర్ లాయర్‌తో. లాయర్ ఆశ్చర్యంగా సాగర్ వైపు చూశాడు.

"అవునండీ నిన్న ఒక మాట చెప్పాను. గుర్తుందాండీ! మా అమ్మంటే నాకు ప్రాణమని. ఒక్కగానొక్క కొడుకుని. నా కాపురం ఇలా డిస్టర్బ్ కావటం ఆమె భరించగలదో లేదో? అందుకే వాసంతిని కొన్నాళ్ళు నటించమని రిక్వెస్ట్ చేశాను. నా భార్యగా నటించమని! మా అక్క ఖరగ్‌పూర్లో ఉంటుంది. కొన్నాళ్ళలో ఆమెను ఎలాగో, అక్కడికి పంపేస్తాను. అప్పటి దాకా మేం కలిసే ఉంటాం" అతడు ఆ మాటల్ని ఎంతో తేలిగ్గా చెప్పాలని చిరునవ్వుతో అలంకరించి చెప్పాడు. కానీ విషాదం ధ్వనించక మానలేదు.

"ఎప్పుడూ ఇంతే సాగర్‌గారూ! ఒక సంసారం విచ్ఛిన్నం అయితే ఇలాంటి విషాదాలు ఎన్నో!" బాధపడుతూ అన్నాడు లాయర్.

"అత్తయ్య గారిని తలుచుకుంటే చాలు, అప్రయత్నంగానే కళ్ళు చెమర్చుతున్నాయి నాకు.... షి వాజ్ మై మదర్ రాదర్ దాన్ బియింగ్ ఎ మదరిన్లా" వాసంతి కంఠంలో శోకం శ్రుతి పలికింది.

"గుడీవినింగ్ ఎవ్రిబడీ." అందరూ గుమ్మం వేపు చూశారు.

రాఘవ నిలబడి ఉన్నాడు.

లోపలికి వచ్చి కూర్చుంటూ అన్నాడు: "ఐయాం ది సోకాల్డ్ రాఘవ. మీతో వేరే విషయం మాట్లాడదామని వచ్చాను లాయర్ గారూ, కానీ ఇక్కడి సన్నివేశం.... సర్లే పోనీండి కానీ, మీరు ఎల్లుండి దాకా వాసంతి పిటిషన్ కోర్టులో వెయ్యొద్దు. వాళ్ళిద్దరూ మళ్ళీ ఆలోచించుకుంటారు. "మధ్యలో ఏదో చెప్ప బోయిన సాగర్ని వారించుతూ మళ్ళీ అన్నాడు.

"తల్లి విలువ, భార్య విలువ నాకు తెలుసు సాగర్! నేనిప్పుడు మీకు ఏ లెక్చర్ ఇవ్వ దలుచుకోలేదు. జస్ట్ ఎల్లుండిదాకా ఆలోచించండి మీ ఇద్దరూ మళ్ళీ. దెన్.... యాజ్ యూ ప్లీజ్ ఏమంటావు వాసంతి?"

వాసంతి మాట్లాడలేదు. సాగర్ కూడా మౌనం వహించాడు. వారి మౌనం, వారి అంగీకారంగా భావించిన లాయర్ కూడా అన్నాడు "ఎల్లుండి రండి!" అని.

కానీ వారిద్దరూ మళ్ళీ లాయర్ దగ్గరికి వెళ్ళ లేదు. ఎందుకంటే, ఆ మర్నాడే రాఘవ రైలు క్రిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

**-శ్రీశైలమూర్తి**
**(హైదరాబాద్)**

# సంగమం

"మీరొక్కసారి ఆలోచించండి మీరుచేస్తున్న పని సరైనదో కాదో, తర్వాత ఆలోచించుకొనే వ్యవధికూడా ఉండదు" విడాకుల కోసం వచ్చిన సాగర్‌కేసి చూస్తూ అన్నాడు లాయర్ పద్మ భూషణ్.

"మరింక ఆలోచించడానికేం లేదు. మేం బాగా ఆలోచించుకొనే ఈ నిర్ణయానికి వచ్చాం" అన్నాడు సాగర్ దృఢంగా.

"సరే అయితే ఇక్కడ సంతకంచెయ్యండి" అంటూ కాగితాలందించాడు.

"కానీ ఒక చిన్న అభ్యర్థన" అన్నాడు సాగర్ సంతకం చేస్తూ.

"ఏమిటది"

"విడాకులిచ్చినా మేం ఒకే ఇంట్లో ఉంటా మండి" అన్నాడు సాగర్ లాయర్‌తో అభ్యర్థనగా.

"ఎందుకలాగ" విస్మయంగా అడిగాడు పద్మ భూషణ్.

"ఎందుకంటే ప్రస్తుతం మేం అద్దె ఇంట్లో ఉంటున్నాం. మళ్ళీ ఇంకో ఇల్లు ఈ హైదరాబాద్ మహానగరంలో దొరకడం చాలా కష్టం అందుకే విడాకులిచ్చినా ఒకే ఇంట్లో ఉంటాం' వివరించాడు సాగర్.

"ఓకే....ఓకే" అన్నాడు పద్మభూషణ్ నవ్వేస్తూ.

* * * *

అలవాటుగా ఆఫీస్ నుండి వచ్చి నిస్సత్తువగా సోఫాలో కూలబడిపోయాడు సాగర్.

భర్తకి కాఫీకప్పు అందించింది సారిక.

"ఓహో అద్భుతం" అన్నాడు సాగర్ కాఫీ సిప్‌చేస్తూ.

అప్పుడుగానీ తెలియలేదు ఇద్దరికి వాళ్ళెంత పొరబాటు చేసారో. సాగర్ పరుగులాంటి నడకలో గదిలో దూరి తలుపేసుకున్నాడు.

ఎనిమిదయ్యింది....

"ఏమండీ! భోజనానికి రండి" కేకేసింది సారిక.

తలుపు తీసుకొని రాబోయిన సాగర్‌కి అంతలోనే గుర్తొచ్చింది. రోజూలాగ కాక ఈరోజే ఇద్దరూ వేరయిపోయారని. అందుకే షర్టుతొడుక్కుని హోటల్ వేపు నడిచాడు.

* * * *

'ఇంకో పదిరోజుల్లోమీకు విడాకులొచ్చేస్తాయి' అన్నాడు పద్మభూషణ్ సాగర్‌తో.

"సార్! మాకు విడాకులొద్దు" అన్నాడు సాగర్.

"వాట్! వద్దా? మరారోజు విడాకులెందుకు కోరుకున్నారు. ఇప్పుడొద్దంటున్నారు. అంతా మీఇష్టమేనా? అయినా ఆరోజే చెప్పాను మరొక్కసారి ఆలోచించుకోమని"

"అవుననుకోండి గానీ మేం ఇద్దరం ఒకర్నొకరు విడిచి ఇంకొకరు ఉండలేం. ఈ విషయాన్ని గ్రహించకుండా ఏవో మనస్పర్థలొచ్చాయని విడాకులు కోరుకున్నాం.... గానీ ఇప్పుడొద్దంటున్నాం.... అయినా ఇప్పుడు విడాకులొద్దనే అవకాశం లేదా" అన్నాడు సాగర్.

"ఒక విధంగా అయితే ఉందోయ్" అన్నాడు పద్మభూషణ్ సాలోచనగా.

"ఏలాగసార్!" ఆత్రంగా అడిగాడు సాగర్.

"రేపు మీరిద్దరూ నన్ను డిన్నర్‌కి ఆహ్వానించండి చాలు"

"సార్! ఏమిటిది" ఎగ్జయిటింగ్‌గా అరిచాడు సాగర్.

"అవునోయ్ నేనింకా మీ విడాకుల గురించి కోర్టుకెళ్ళలేదు. అవి నావద్దే నిక్షేపంగా ఉన్నాయి. ఆ రోజు మనస్పర్థలొచ్చాయని విడాకులు కోరుకుంటూ నా దగ్గర కొచ్చినప్పుడే నేను గ్రహించాను మీరిద్దరూ మళ్ళీ కలుస్తారని. అందుకే ఆ కాగితాలు కోర్టుకి పంపలేదు".

"సార్ మీకు కృతజ్ఞతలెలా చెప్పాలో తెలియడం లేదు" అన్నాడు సాగర్ పద్మభూషణ్‌తో.

"ఓ పిల్లణ్ణి కని" అన్నాడు పద్మభూషణ్.

**ఎస్. వేణుగోపాల్-కుమార్**
**(విజయనగరం)**

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"అంత దారుణంగా అమ్మనెలా చంపగలిగావు నాన్నా?" ఏకైక కొడుకు అడిగింది కరుణ తండ్రిని.